చెంతనే వైద్యం.. అందరికీ ఆరోగ్యం

- కొవ్వూరులో రెండు అర్బన్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం
- రూ.2.30 కోట్ల కేటాయింపు
- మూడు నెలల్లో అందుబాటులోకి..

కొవ్వూరు: పేదోడికి ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా ఇప్పుడు చింత లేదు. సామాన్యుడి ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారి ముంగిటికే వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే కుటుంబ వైద్యుడి విధానం (ఫ్యామిలీ డాక్టర్) ద్వారా వైద్య సేవలు పేదలకు దగ్గరయ్యాయి. ఇప్పుడు కొవ్వూరు పట్టణంలో కొత్తగా రెండు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ వాసులకు కిలో మీటరు లోపు దూరంలో ఉండేలా ఈ ఆసుపత్రులు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందుకోసం అత్యాధునిక హంగులతో రెండు ఆసుపత్రి భవనాల నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి. మరో మూడు నెలల్లో నూతన భవనాల నిర్మాణాలు పూర్తి కానున్నాయి. వీటిలో పలు రకాల వైద్య పరీక్షలు, మందులు రోగులకు అందుబాటులో ఉంచుతారు.

రూ.2.30 కోట్ల వ్యయంతో..

పట్టణంలో నిర్మిస్తున్న ఈ రెండు ఆరోగ్య కేంద్రాలకు రూ.2.30 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. మెరక వీధిలోని క్రిస్టియన్ పేటను ఆనుకుని ఈజీకే రోడ్డు పక్కనే రూ.1.07 కోట్ల వ్యయంతో ఒకటి, శ్రీనివాసపురం సమీప టోల్‌గేట్ జంక్షన్ వద్ద రూ.1.23 కోట్ల వ్యయంతో మరొకటి నిర్మిస్తున్నారు. ఒక్కో ఆరోగ్య కేంద్రంలో రెండేసి ఆపరేషన్ థియేటర్లు, ఫార్మసీ రూము, ల్యాబ్, మినీ వార్డు, వెయిటింగ్ హాలు, లేబర్ రూమ్, మైనర్ ఓటీ, మీటింగ్ హాలు, ఓపీ గదుల చొప్పున నిర్మిస్తున్నారు. క్రిస్టియన్‌పేట ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే ఒకటి నుంచి ఐదు వార్డుల వారితో పాటు 23 వార్డు ప్రజలకు కూడా వైద్య సేవలు మరింత చేరువ అవుతాయి. సామాజిక ఆసుపత్రికి పట్టణ ఆరోగ్య కేంద్రానికి మధ్య ప్రాంతంలో గల ఏడు, ఎనిమిది, ఆరు వార్డుల ప్రజలకు కూడా ఈ ఆసుపత్రి ఉపకరిస్తుంది. శ్రీనివాసపురం ఆరోగ్య కేంద్రం ఔరంగాబాద్, శ్రీనివాసపురం, వాంబే కాలనీ, బ్రిడ్జిపేట, వేములూరు గ్రామస్తులకు బాగా సౌలభ్యంగా ఉంటుంది. వారు పట్టణంలోకి వచ్చి వైద్య సేవలు పొందాలంటే ప్రస్తుతం కనీసం మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. శ్రీనివాసపురం ఆరోగ్య కేంద్రంలో సేవలు మొదలైతే కిలోమీటరు దూరంలోనే ఈ ప్రాంతాలవారికి వైద్యం అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం క్రిస్టియన్‌పేటలో ఒకటి, గాయత్రీ థియేటర్ సెంటర్ వద్ద మరొక అర్బన్ హెల్త్ సెంటర్లు నడుస్తున్నాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలు పూర్తయితే ఈ రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఈ భవనాల్లోకి మార్చుచేస్తారు.


ముగింపు దశలో ఉన్న శ్రీనివాసపురం అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం

పెద్దాసుపత్రి సేవలు అదనం

ప్రస్తుతం పట్టణంలో 50 పడకల ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నడుస్తుంది. రోజూ ఇక్కడ సగటున 400 మంది వైద్య సేవలు పొందుతున్నారు. నెలకు 70 నుంచి 80 డెలివరీలు, సుమారు 400 మైనర్, 50 మేజర్ సర్జరీలు చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ రహదారి సమీపంలోని ఏడు మండలాలకు చెందిన 1,08,445 మంది ఇక్కడ సేవలు పొందుతున్నారు. ఇక్కడి ల్యాబ్‌లో నలభై రకాల వైద్య సేవలు అందిస్తున్నారు.


క్రిస్టియన్‌పేట వద్ద నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

కరోనాతో పనులకు ఆటంకం

కొత్తగా చేపట్టిన రెండు పట్టణ ఆరోగ్య కేంద్ర భవనాలను 2021 జూన్ 28న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శంకుస్థాపన చేశారు.ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ కరోనా వ్యాప్తి కారణంగా జాప్యం జరిగింది. దీంతో నిర్మాణ వ్యయం కూడా గణనీయంగా పెరిగింది. అయినప్పటికీ ప్రభుత్వం ఎక్కడా వెనక్కి తగ్గలేదు. మొదట్లో ఒక్కో భవనానికి రూ.80 లక్షల చొప్పున కేటాయించారు.తర్వాత క్రిస్టియన్‌పేట భవనానికి రూ.27 లక్షలు, శ్రీనివాసపురం భవనానికి రూ.43 లక్షలు అదనంగా కేటాయించారు.

పేదల వైద్యానికి పెద్దపీట



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తోంది. ఆరోగ్యశ్రీ ద్వారా ఎన్నో రకాల వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నాం. పట్టణంలో రూ.2.30 కోట్ల వ్యయంతో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో ఏ పేదోడూ వైద్యం అందక ఇబ్బంది పడరాదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారు.

– తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

మూడు నెలల్లో పనులు పూర్తి



అర్బన్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులు మరో మూడు నెలల్లోగా పూర్తవుతాయి. ఇప్పటికే శ్రీనివాసపురం భవనం ఫినిషింగ్ దశలో ఉంది.క్రిస్టియన్‌పేట భవనం దాదాపు యాభై శాతం పనులు పూర్తి చేశాం.అదనంగా మంజూరైన నిధులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. వేగంగా నిర్మాణ పనులు నడుస్తున్నాయి.

– బి. శ్రీకాంత్, కమిషనర్, కొవ్వూరు మున్సిపాలిటీ

క్లుప్తంగా

నేడు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

దేవరపల్లి: పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని యర్నగూడెంలో శనివారం ఉదయం 10 గంటలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన జయం సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో ఈ కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్టు పార్డ్ సంస్థ ప్రతినిధి సత్తిరాజు తెలిపారు. రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. రోజుకు 30 మందికి మూడు బ్యాచ్‌లలో శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.

ఐ.పంగిడిలో మేడే పోస్టర్ ఆవిష్కరణ


మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కొవ్వూరు: ప్రగతిశీల కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని ఐ.పంగిడిలో మే 1న నిర్వహించే కార్మిక దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ శుక్రవారం ఐ.పంగిడిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించిందన్నారు. కార్మిక హక్కులను హరిస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా వాటిని మార్పు చేస్తోందని విమర్శించారు. ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల రద్దును వ్యతిరేకిస్తూ మేడే నాడు చేపట్టిన నిరసన కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని కోరారు. క్రషర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంటా కృష్ణ, సత్యనారాయణ, వీరబాబు, సూరిబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

దేవరపల్లి: ఇటీవల మండలంలోని యర్నగూడెంలో సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు పూర్తిగా దగ్ధమైన సంగతి తెలిసిందే. రెండు బాధిత కుటుంబాలను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం సాయంత్రం పరామర్శించారు. స్థానిక సొసైటీ ద్వారా రూ.10 వేలు, పంచాయతీ ద్వారా రూ.7వేలు, 20 కిలోల బియ్యం ఎమ్మెల్యే వెంకట్రావు బాధితులు షేక్ అమీనా, కడియం దావీదులకు అందజేశారు. ప్రభుత్వం ద్వారా బాధితులను ఆదుకోవడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, సొసైటీ అధ్యక్షుడు నరహరిశెట్టి వైదేహి, సీతఊట మండా పెదబాబు, ఎంపీటీసీ సభ్యులు బొంతా చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: మండలంలోని సంగాయగూడెంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కుందుర్తి గంగరాజు కుటుంబ సభ్యులను నియోజకవర్గ జనసేన నాయకుడు డి.సువర్ణరాజు శుక్రవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలశాఖ అధ్యక్షుడు కాట్నం గణేష్, చప్పటి శివ, మాలే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి

గోపాలపురం: త్వరితగతిన రైతులు పండించిన రబీ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం గోపాలపురంలో మండల వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి జేష్ఠ సతీష్‌బాబు మాట్లాడుతూ గతేడాది మొదట్లో మద్దతు ధర రూ.1500 చెల్లించిన ప్రభుత్వం చివర్లో రూ 1100 రేటుకు కొనుగోలు చేయడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మట్టపర్తి రామ్మోహన్ రావు, గన్నిన రామారాయుడు, కొలూరి రతన్ రాజు, సుంకర సత్యనారాయణ పాల్గొన్నారు.

23న 'గురుకుల' ప్రవేశాలకు ప్రతిభా పరీక్ష

గోపాలపురం: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లలో ప్రవేశాలకు ఈనెల 23న ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు గోపాలపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఐదో తరగతి, 2 గంటల నుంచి సాయంత్ర 4.30 గంటల వరకూ ఇంటర్ విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. 5వ తరగతి విద్యార్థులు ఏపీ జీపీసీ ఈటీ, ఐ ఏస్ వెబ్‌సైట్,ఏపీజీపీసీ ఈటీ ఏపీ సీఎఫ్, ఎస్ఎస్ ఐఎన్‌టీఈఆర్ వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉమాదేవి సూచించారు.

1 నుంచి సూరాపురంలో పుట్టాలమ్మ జాతర


పుట్టాలమ్మ

నిడదవోలు రూరల్: మండలంలోని సూరాపురం గ్రామ దేవత పుట్టాలమ్మ తల్లి జాతర మహోత్సవాలను మే 1 నుంచి 7 వరకూ నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జాతర కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 2వ తేదీన జబర్దస్ యాంకర్ రైజింగ్ రాజుచే కామెడీ షో, 3న సుప్రీం ఈవెంట్స్ వారిచే ఆర్కెస్ట్రా, 5న అమ్మవారి సేవ, కుంకుమ పూజలు, 6న బలిచేట, గ్రామోత్సవం, 7న నైవేద్యాలతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- ఊనగట్లలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


ఊనగట్లలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా పాటు పడుతోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని ఊనగట్ల నుంచి అమ్మకుంట వరకూ రూ.103.50 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మిస్తున్న మూడు కిలోమీటర్ల పొడవైన బీటీ రోడ్డుకు శుక్రవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అవినీతి, లంచాలకు అస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, ఆత్మ చైర్మన్ గండ్రోతు సురేంద్ర కుమార్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సొసైటీ అధ్యక్షులు ఆత్కూరి దొరయ్య, లకంసాని సూర్యప్రకాశరావు, గూడపాటి శివ, ఊనగట్ల సర్పంచ్ మట్టా వెంకట్రావు, కంకటాల శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ లబ్ధి జగన్ గొప్పతనమే

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 18వ వార్డులో 100వ రోజు గడప గడపకూ..


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో గురువారం రాత్రి 100వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూర్చిన మేలును ప్రజలకు ఆమె వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, వైఎస్సార్ సీపీ నేతలు చొటుపల్లి వీరన్న, సలాది సందీప్, రుత్తల భాస్కరరావు, ఏలూరి విజయలక్ష్మి, సుంకర సత్యనారాయణ, ఆత్కూరి దొరయ్య, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, కౌన్సిలర్లు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దేవరపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

దేవరపల్లి: రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. దేవరపల్లి ఆర్‌బీకే వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. ధాన్యంలోని తేమ శాతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండించి ప్రతి పంటకూ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతును ఆదుకొంటుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజుల్లో రైతుల ఖాతాలకు సొమ్ము జమ అవుతుందన్నారు. ధాన్యం దిగుబడులు, మద్దతు ధర గురించి ఎమ్మెల్యే వెంకట్రావు రైతులను అడిగి తెలుసుకున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, మద్దతు ధర బాగుందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, పార్టీ ద్వారకాతిరుమల మండల అధ్యక్షులు ప్రతాపనేని వాసుబాబు, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, కడిమి రాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ, ఏవో కె.విజయ్, సొసైటీ సీఈఓ కేఎస్ఎస్ శర్మ, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

కె.సావరంలో ఫ్రైడే- డ్రైడే

ఉండ్రాజవరం: దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మలేరియా తణుకు సబ్ యూనిట్ అధికారి జి. వెంకటేశ్వరరావు సూచించారు. ఫ్రైడే- డ్రై డే, వెక్టర్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను మండలంలోని కె.సావరం గ్రామంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు గుంటలు, నీళ్లకుండీలు, టైర్లు, తాగి పడవేసిన కొబ్బరి బొండాలు, రుబ్బు రోళ్లలో నిల్వ ఉన్న నీటిలో వైరస్ పెరిగి అక్కడి దోమలు మనిషిని కుట్టడం ద్వారా డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో చెత్త, మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. వార్డ్ హెల్త్ సెక్రటరీ రత్నకుమారి, ఏఎన్ఎం శ్యామల, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నిడదవోలు రూరల్: పట్టణంలోని రైల్వే గేట్ వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాస్, మేడా గురుదత్త ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. చలివేంద్రం వద్ద మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రంగా రమేష్, కాకర్ల నాని, చిప్పాటి శివ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంబేడ్కర్ జయంతి వేడుకలు


అన్నదేవరపేట వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

తాళ్లపూడి: అంబేడ్కర్ జయంతి ముగింపు వేడుకలను శుక్రవారం రాత్రి మండలంలోని అన్నదేవరపేటలో ఘనంగా నిర్వహించారు. అధ్యాపకుడు సరింగల వీరాస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అంబేడ్కర్ యూత్‌ను ప్రోత్సహిస్తున్న వీరాస్వామిని పలువురు అభినందించారు. అనంతరం సుమారు రెండు వేల మందికి అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎన్. జయరాజు, సర్పంచ్ గండి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల బాబురావు, పిట్టా శ్రీనివాస్, ఆంజనేయులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'


తిమ్మరాజుపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు


నిడదవోలు రూరల్: జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అట్లపాడు, తిమ్మరాజుపాలెం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చాగల్లు: గ్రామ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో మండలంలోని చాగల్లు, మార్కొండపాడు, నందిగంపాడు, చిక్కాల, బ్రాహ్మణగూడెం, మీనానగరం, ఊనగట్ల, నెలటూరు, గౌరిపల్లి తదితర గ్రామాల్లో కోలాహలంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షులు సుంకర రాయుడు, గూడపాటి శివ, లంకసాని రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పిల్లి తిరుమలరావు, ఉబా భాగ్యవతి, గేడా శ్యామ్, తాళ్లూరి దామోదరం, మట్టా శకుంతల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

నల్లజర్ల: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు బళ్ళ ప్రభాకరరావు (నాని) తన పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం రాత్రి నల్లజర్లలోని అనాథ పిల్లల ఆనంద నిలయం (వసతి గృహం)లో జరుపుకున్నారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు బుక్స్, పెన్నులు, మిఠాయిలు పంచారు. విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ ఈదా డేవిడ్, ర్యాలి వెంకటస్వామి, కామోజు కాశీ, టీఎస్ఎన్, మీసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కుర్చీ కోసం బాబు తహతహలు


విలేకరుల సమావేశంలో మంగరాజు

గోపాలపురం: ముఖ్యమంత్రి కుర్చీ కోసం చంద్రబాబు తహతహలాడుతున్నారని పచ్చ మీడియాను అడ్డుపెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. గోపాలపురంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన చంద్రబాబుపై ధ్వజమెత్తారు. మాల సంఘాల జేఏసీ నాయకులు పేర్కొంటున్న 22 పథకాలను జగన్ ప్రభుత్వం తొలగించలేదని, అవన్నీ కూడా నవరత్నాలలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా దళిత జేఏసీ నాయకులు అసత్య ప్రకటనలు మానుకోవాలని మంగరాజు హితవు పలికారు. విలేకరుల సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపర్తి అనురాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కస్సే బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి బందెల బంగారమ్మ, పీవీ రావు మాలమహానాడు నాయకుడు దొడ్డి వెంకటేశ్వర్లు, చీకటిమిల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.